

భగత్‌సింగ్ కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్

సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం

- కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులు పూర్తయిన ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం ఫిలింనగర్ భగత్‌సింగ్ కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. గతంలో తాను హామీ ఇచ్చినట్లు తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి

బేగంపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి అన్నారు. డివిజన్‌లో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించాలని వాటర్ వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్వరి మాట్లాడుతూ.. పలు కాలనీలు, బస్తీలలో గత మూడు నెలలుగా తాగునీరు సక్రమంగా రావడం లేదని, తక్కువ ప్రెషర్‌లో, తక్కువ సమయంలో వస్తుండటంతో చాలా మందికి తాగునీరు అందడం లేదన్నారు. ఈ విషయంపై జలమండలి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని, తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించాలని వాటర్ వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డిని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు.



వాటర్ వర్క్స్ ఎండీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ హరిశ్చంద్రారెడ్డి

డ్రగ్స్ వినియోగిస్తున్న వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

బేగంపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వినియోగిస్తున్న వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని యాంటీ నార్కోటిక్ డీఎస్పీ హరిశ్చంద్రారెడ్డి అన్నారు. సోమవారం రాజ్‌భవన్ పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలలో, ఇంటి పరిసరాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలిస్తే 1908 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. తోటి విద్యార్థులపై అనుమానం వస్తే ఆ విషయాన్ని ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ బుచ్చయ్య, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం గోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు
విద్యార్థుల వినూత్న ప్రాజెక్టు

- అభినందించిన కమిషనర్ ఇలంబరిది

హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవే లక్ష్యంగా విద్యార్థులు చేపట్టిన ప్రాజెక్టు ఆకట్టుకుంటోంది. నిత్యావసరాల్లో భాగమైన పాల ప్యాకెట్లను పడేయకుండా ధృడమైన ఫ్యాబ్రిక్‌లా మార్చి బ్యాగులు, పెన్సిల్ పౌచ్‌లు, ఫోల్డర్ల వంటి పునర్వినియోగ వస్తువులను తయారు చేస్తున్నారు. వాటి విక్రయం ద్వారా వచ్చే డబ్బులను నిరుపేదలకు ఆహారం అందించేందుకు వినియోగిస్తున్నారు. 'సిప్, సేవ్, స్టైల్' పేరిట వినూత్న ప్రాజెక్టు చేపట్టిన భారతీయ విద్యాభవన్, ఆత్మకూరు రామ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబరిదిని కలిశారు. ప్రాజెక్టు వివరాలను ఆయనకు వివరించారు. ప్లాస్టిక్ పునర్వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు సామాజికసేవ కోసం ప్రాజెక్టు చేపట్టినట్టు చెప్పారు. విద్యార్థులను కమిషనర్ అభినందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 22, గోరా వెంచర్, మాదాపూర్ ఐటీసీ, వెంకటేశ్వర కళాశాల ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో.. ఉదయం 10.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు 11కేవీ అపోలో ఆస్పత్రి ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో.. ఉదయం 11 గంటల నుంచి 11.45 గంటల వరకు పద్మాలయ స్టూడియో ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో.. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు భారతీయ విద్యా భవన్ స్కూల్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు బీఎస్‌ఎన్‌ఎల్, ఆరోగ్యశ్రీ, సిలికాన్ వ్యాలీ, హుడా ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2.45 గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు ఫిలింనగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

నేడు కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులకు అవకాశం

బోరబండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లి అయిన దంపతులందరికీ కొత్త రేషన్ కార్డులు అందించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. కార్మిక నగర్ ఎస్‌పీఆర్ హిల్స్‌లో నేడు జరిగే కొత్త రేషన్ కార్డుదారుల అవగాహన కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కార్డు మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

మహిళా పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

పంజాగుట్ట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, నగదు రహిత ఆరోగ్య సేవలు, కొత్త హెల్త్ కార్డులు అందించాలని రాష్ట్ర మహిళా పెన్షనర్ల ఫోరం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫోరం రాష్ట్ర అడహక్ కమిటీ చైర్‌పర్సన్ ఆర్.ఉమాదేవి, కో చైర్ పర్సన్ కె.ధనలక్ష్మి, కన్వీనర్ ఎస్.ఎం.ఎల్ నాగమాంబ మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 2.90 లక్షల మంది మహిళా పెన్షనర్లు, 2.68 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారని.. వారు తమ బేసిక్ పేలో ఒక శాతం ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్టుకు కాంట్రిబ్యూట్ చేస్తున్నారన్నారు. తమ సమస్యలను పరిష్కరించడానికి ఒక ట్రస్టును ఏర్పాటు చేయాలని కోరారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చి 6న నగరంలో వేడుకలు నిర్వహిస్తామని, ఈ లోపు ప్రభుత్వం స్పందించి ఉచిత హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ఫోరం వైస్ చైర్‌పర్సన్లు నాగమణి రెడ్డి, జానకి, కో కన్వీనర్లు భాగ్యలక్ష్మి, జి.లక్ష్మి, కోశాధికారి డి.జ్యోతిశ్రీ, సఫియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పెన్షనర్ల ఫోరం ప్రతినిధులు

ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేలా..

- ఐటీ కారిడార్ కూడళ్లపై అధికారుల ప్రత్యేక దృష్టి
- ప్రత్యామ్నాయ మార్గాలపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల అధ్యయనం
- ప్రత్యేక రూట్‌మ్యాప్‌లతో సమస్యను పరిష్కరించే యత్నం
- త్వరలోనే కార్యరూపం దాల్చే అవకాశం



హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరంలో అత్యధిక సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా ఐటీ కారిడార్ మారింది. కేవలం ఐటీ రంగంలోనే సుమారు 9.5 లక్షల మంది వెస్ట్ హైదరాబాద్ పరిధిలోని ఐటీ కారిడార్‌లో పనిచేస్తున్నారు. దీంతో నగరం నలుమూలల నుంచి ఉద్యోగులు మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, నానక్‌రామ్‌గూడ, కోకాపేట, పుప్పాల్‌గూడ వంటి ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లోనే కాకుండా ఇతర సమయాల్లోనూ రోడ్లపై రద్దీ అధికంగా ఉంటోంది. ఆ ప్రాంతాల్లో ఐటీ కంపెనీల కార్యకలాపాలే కాకుండా భవన నిర్మాణ రంగానికి సంబంధించిన పనులు భారీ ఎత్తున జరుగుతుండడంతో ఆ రంగాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు నగరం నలుమూలల నుంచి ఇక్కడికి వస్తుంటారు. దీంతో నగరంలో ఎక్కడా లేనివిధంగా ఐటీ కారిడార్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. కొత్తగా ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, లింకు రోడ్లు నిర్మించినా ప్రధాన రహదారులు, కూడళ్లపై రద్దీ పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో సైబరాబాద్ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగం ఐటీ కారిడార్‌పై ప్రత్యేక దృష్టి సారించింది.

ప్రత్యామ్నాయ మార్గాలపై అధ్యయనం

ఐటీ కారిడార్‌లో ప్రధానంగా కొండాపూర్-మాదాపూర్-జూబ్లీహిల్స్ మార్గం, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 నుంచి దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి మీదుగా మైండ్ స్పేస్ జంక్షన్, గచ్చిబౌలి.. అదే విధంగా మెహిదీపట్నం నుంచి టోలిచౌకి-షేక్‌పేట-రాయదుర్గం-గచ్చిబౌలి వంటి మార్గాలకు ప్రత్యామ్నాయ దారులను అందుబాటులోకి తీసుకురావడంపై క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఈ మార్గాల్లో నిర్మించిన ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, లింకు రోడ్లన్నీ జామ్ అవుతున్నాయి. మాదాపూర్ ఇమేజ్ ఆస్పత్రి నుంచి మైండ్ స్పేస్ ఐటీ సెజ్ మీదుగా టీ హబ్ కూడలి నుంచి రాయదుర్గం-నానక్‌రాంగూడ వెళ్లే మార్గాన్ని ప్రధాన రహదారిగా అందుబాటులోకి తీసుకువస్తే ఈ మార్గాల్లో వచ్చే వాహనాలను అంతర్గత రోడ్లకు మళ్లించేందుకు అవకాశం ఉంటుందని ప్రాథమికంగా గుర్తించారు. అవసరమైన ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ చేపడితే వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతుందని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులను సైతం ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోల రాకపోకలకు అనుకూలంగా చేస్తే కొంత ప్రయోజనం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూట్‌మ్యాప్‌లను రూపొందించి జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ట్రాఫిక్ అధికారులు పనిచేయనున్నారు.

ఐటీ కారిడార్‌లో రద్దీగా ఉండే కూడళ్లు..

- సైబర్ టవర్స్
- మైండ్ స్పేస్ జంక్షన్
- రాయదుర్గం బయోడైవర్సిటీ
- గచ్చిబౌలి ఓఆర్‌ఆర్ జంక్షన్
- రాయదుర్గం-ఖాజాగూడ రోడ్డు
- నానక్‌రామ్‌గూడ ఓఆర్‌ఆర్ జంక్షన్
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ విప్రో సర్కిల్
- గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ జంక్షన్
- కొండాపూర్ బొటానికల్ గార్డెన్
- జూబ్లీహిల్స్-అయ్యప్ప సొసైటీ రోడ్డు జంక్షన్

అభివృద్ధిలో వెనకడుగు వేయం

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

బంజారాహిల్స్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి విషయంలో వెనకడుగు వేసేది లేదని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. వెంకటేశ్వర కాలనీ డివిజన్ పరిధిలోని పంజాగుట్ట ప్రతాప నగర్ బస్తీలో రూ.85 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి సోమవారం విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లకు సూచించారు. త్వరలోనే ప్రతాప నగర్ బస్తీలో మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు గ్రేటర్ పరిధిలోని అన్ని డివిజన్లలో పర్యటిస్తున్నామని.. ఇందులో భాగంగా నాలుగు రోజుల క్రితం వెంకటేశ్వరనగర్‌కాలనీ డివిజన్‌లో పర్యటించి స్థానిక సమస్యలపై అవగాహనకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఆ సమస్యల్లో కొన్నింటిని తక్షణమే పరిష్కరించేందుకు ప్రస్తుతం నిధులు కేటాయించామని, దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. గ్రేటర్ పరిధిలో పారిశుధ్య సమస్యలను పరిష్కరించేందుకు అధునాతన విధానాలను అనుసరిస్తూ జీహెచ్‌ఎంసీ ముందుకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే పారిశుధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి కోసం 35 కోట్ల రూపాయలు మంజూరు చేశామని, మరో 40 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు అధికారులతో తరుచూ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. మాజీ కార్పొరేటర్ భారతి నాయక్, రాములుచౌహాన్, నల్ల శివ, బి.శ్రీనివాస్, యాకరి గణేష్, ఆనంద్ పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

ఖైరతాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో క్యాంటీన్ అందుబాటులోకి వచ్చింది. ఇందిరా మహిళా శక్తి పేరిట పొదుపు సంఘాల మహిళలే ఏర్పాటు చేస్తున్న క్యాంటీన్‌లలో భాగంగా ఎన్‌బీటీ నగర్‌కు చెందిన గణేష్ స్వయం సహాయక గ్రూపునకు రూ.10 లక్షల బ్యాంకు రుణం మంజూరు కాగా ఐదుగురు సభ్యులు ఈ క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం మేయర్ గద్వాల విజయలక్ష్మి జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, తదితరులతో కలిసి క్యాంటీన్‌ను ప్రారంభించి మహిళలను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారని, మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా మహిళా శక్తి క్యాంటీన్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. యూసీడీ అదనపు కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, ఉప కమిషనర్లు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబరిది

హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబరిది అధికారులకు సూచించారు. ఖైరతాబాద్ జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డితో కలిసి కమిషనర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఆయా విభాగాల అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలు తెలియజేయాలన్నారు. డిప్యూటీ మేయర్ శ్రీలత మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించడంపై ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాంలో 3 విన్నపాలు రాగా ఆయా విభాగాలకు పంపించారు. ప్రజావాణిలో 55 విన్నపాలు రాగా టౌన్‌ప్లానింగ్ విభాగానికి 30, ట్యాక్స్ విభాగానికి 5, ఎఫ్‌ఏ విభాగానికి 4, యూబీడీ 3, ఇంజనీరింగ్, శానిటేషన్, హెల్త్, వెటర్నరీ, ఎస్టేట్స్ విభాగాలకు రెండు ఫిర్యాదులు చొప్పున రాగా, ల్యాండ్ అక్విజిషన్, విజిలెన్స్, అడ్మిన్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు పాల్గొన్నారు.



జస్వంత్‌ను అభినందిస్తున్న కలెక్టర్

ఖోఖో క్రీడాకారుడికి కలెక్టర్ అభినందన

బేగంపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్న హైదరాబాద్‌కు చెందిన ఏకైక విద్యార్థి జస్వంత్‌ను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అభినందించారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ నెల 10 నుంచి 13 వరకు ఎస్‌జీఎఫ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 68వ జాతీయ స్థాయి పోటీల్లో నగరంలోని రాజ్‌భవన్ పాఠశాల విద్యార్థి భైరి జస్వంత్ పాల్గొన్నాడు. అండర్ 14 విభాగంలో జస్వంత్ పాల్గొన్న తెలంగాణ జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో విద్యార్థి జస్వంత్‌ను కలెక్టర్ సోమవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పీర్కొండ, లత తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎస్‌సీ జైన్

బ్యాంకు ఉద్యోగుల పెన్షన్ రివిజన్‌ను చేపట్టాలి

పంజాగుట్ట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బ్యాంకు ఉద్యోగుల పెన్షన్ రివిజన్, నవీకరణను వెంటనే చేపట్టాలని అఖిల భారత బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్(ఏఐబీఆర్ఎఫ్) డిమాండ్ చేసింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫెడరేషన్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌ఎం దేశ్‌పాండే, ప్రధాన కార్యదర్శి ఎస్.సి.జైన్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో బ్యాంకింగ్ రంగంలోని ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారని, అభివృద్ధిలో భాగస్వాములైన బ్యాంకుల విశ్రాంత ఉద్యోగులపై కేంద్ర ప్రభుత్వం, ఐబీఏ వివక్ష చూపడం దుర్మార్గమన్నారు. గత 29 సంవత్సరాలుగా పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు బేసిక్ పెన్షన్‌లో ఎటువంటి పెరుగుదల లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరోగ్య బీమా ప్రీమియం బ్యాంకులే భరించాలని, ప్రైవేట్ బ్యాంకు పెన్షనర్లకు సైతం ఎక్స్ గ్రేషియా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 21, 22, 23 తేదీలలో లక్డీకాపూల్‌లో ఫెడరేషన్ కేంద్ర కార్యవర్గ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.


ట్రై కమిషనరేట్లలో మోస్ట్ వాంటెడ్ దొంగ అరెస్ట్



భరత్‌కుమార్

హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న మోస్ట్ వాంటెడ్ ఘరానా దొంగను సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి ఇళ్లలో దొంగతనాలకు ఉపయోగించే ఎక్విప్‌మెంట్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. చార్మినార్ ప్రాంతానికి చెందిన భరత్‌కుమార్ శర్మ అలియాస్ రాహుల్ కుమార్ శర్మ లేబర్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడు రాత్రిసమయాల్లో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. స్క్రూడ్రైవర్, ఐరన్ రాడ్డుతో తాళాలు విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించి నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులతో ఉడాయిస్తాడు. ఇలా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండతో పాటు.. ఇతర జిల్లాల్లోనూ చోరీలకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. దాంతో మూడు కమిషనరేట్స్ పరిధిలో మోస్ట్ వాంటెడ్ దొంగగా ఉన్న భరత్‌కుమార్‌ను పట్టుకోవడానికి సిటీ సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్ రంగంలోకి దిగింది. నిందితుడి కదలికలపై నిఘా పెట్టి కీసర పరిధిలో సోమవారం అదుపులోకి తీసుకున్నారు.

మానసిక ఆరోగ్యంపై చైతన్యం రావాలి



దేవులపల్లి అమర్‌కు అవార్డును అందజేస్తున్న అల్లం నారాయణ తదితరులు

ఎర్రగడ్డ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మానసిక ఆరోగ్యం పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మాజీ ఎలక్షన్ కమిషనర్ సి.పార్థసారథి అన్నారు. ఐఎంహెచ్ హైదరాబాద్ అలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎర్రగడ్డలోని మానసిక ఆసుపత్రిలో సోమవారం డాక్టర్ పి.రఘురామిరెడ్డి ఎండోమెంట్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి ఎండోమెంట్ ఓరేషన్ అవార్డును సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్‌కు అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్థసారథి మాట్లాడుతూ.. ప్రస్తుత జీవనశైలి కారణంగా మానసిక సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. దేశంలో వైద్య విద్యనభ్యసించి మానసిక నిపుణులుగా మారుతున్న చాలామంది విదేశాల్లోసేవలందిస్తుండడం విచారకరమన్నారు. దేవులపల్లి అమర్ మాట్లాడుతూ.. మెంటల్ అవేర్నెస్‌పై ముందుగా మీడియాలో చైతన్యం రావాలన్నారు. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. మానసిక వ్యాధి అంటే చులకన భావం ఉంటుందని, ఎర్రగడ్డ అంటేనే పిచ్చి అనే అపనింద ఉందన్నారు. ముందు ప్రజలలో ఆ భావన తొలగిపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంహెచ్ హైదరాబాద్ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ పి.కిషన్, కార్యదర్శి డాక్టర్ ఎం.గిరిప్రసాద్, కోశాధికారి డాక్టర్ వై శివ అనుప్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో
బస్టాపులో వ్యక్తి మృతి

ఖైరతాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విధులకు హాజరయ్యేందుకు బస్సులో వచ్చి బస్టాపులోనే కుప్పకూలి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ అమర్‌నాథ్, ఏఎస్‌ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ ఐసీఐసీఐ బ్యాంకు సమీపంలో ఉన్న బస్టాపులో ఓ వ్యక్తి పడిపోయాడని సమాచారం రావడంతో 108 సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అతడిని పరీక్షించి గుండెపోటుతో చనిపోయినట్లు నిర్ధారించారు. అనంతరం అక్కడకు చేరుకున్న పోలీసులు అతడి జేబులో లభించిన ఆధారాల మేరకు ఓ వార్తా పత్రిక కార్యాలయంలో ఫైనాన్స్, అకౌంట్స్ విభాగంలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్న పి.శేషచలపతి రావు(55)గా గుర్తించారు. బాధితుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శేషచలపతిరావు ఒక్కడే అల్వాల్‌లో ఉంటున్నాడని, అతడి స్వస్థలమైన విశాఖపట్నం జిల్లా యలమంచిలిలో భార్య ఉంటున్నట్లు తెలిసింది. మృతదేహానికి శవపంచనామా నిర్వహించి గాంధీఆస్పత్రికి తరలించామని, కుటుంబీకులు వచ్చిన తర్వాత వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

'కర్ణాటక సెంట్రల్ వర్సిటీ నాణ్యమైన విద్యనందిస్తోంది'

పంజాగుట్ట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని కలబురిగిలో ఉన్న కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ నాణ్యమైన విద్య, పరిశోధన, శిక్షణను అందించడంలో ముందు వరుసలో ఉందని యూనివర్సిటీ ప్రతినిధులు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.లింగస్వామి, డాక్టర్ సురేష్ ఏనుగంటి, డాక్టర్ వి.గోవింద్ తెలిపారు.2025-26 విద్యా సంవత్సరానికి గాను యూజీ, పీజీ ప్రోగ్రాంలు అందిస్తున్నామన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో యూనివర్సిటీ అందిస్తున్న పలు పీజీ, పరిశోధన కోర్సుల వివరాలు, యూనివర్సిటీ ప్రత్యేకతలను వారు వెల్లడించారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్.టి.ఏ) ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ పరీక్ష నిర్వహిస్తోందన్నారు. అత్యుత్తమ మార్కులు సాధిస్తే ప్రవేశం పొందవచ్చని వారు తెలిపారు. దరఖాస్తులకు చివరి తేదీ ఫిబ్రవరి 2 అని, మార్చి 13 నుంచి 31 వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

చింతలబస్తీలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన వ్యక్తి

ఖైరతాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చింతలబస్తీ ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఏఎస్‌ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఓ వృద్ధుడు చింతలబస్తీ అరుంధతి సేవా సంఘం కార్యాలయం వద్ద వణుకుతూ కనిపించగా పక్కనే ఉన్న ఓ మెడికల్ దుకాణం నిర్వాహకుడు బ్లాంకెట్ ఇచ్చాడు. అయినా చలి తగ్గకపోగా కొంత సేపటికి ఉలుకు,పలుకు లేకపోవడంతో పరీక్షించగా చనిపోయినట్లు తెలుసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు తెల్లటి ధోతి, బనియన్‌పై ఉన్నాడని, వయస్సు దాదాపు 75 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి వివరాల కోసం ఆరా తీస్తున్నారు. సమాచారం తెలిసిన వారు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో గానీ, 9912820552 నంబర్‌లో గానీ సంప్రదించాలని కోరారు.

నిరంతర సేవకు నిలువుటద్దం.. స్కై ఫౌండేషన్

పద్మారావునగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఒక సామాన్య కన్సల్టెన్సీ నిర్వాహకుడు, ఓ ప్రైవేట్ ఉద్యోగస్తురాలు వారి ఆదాయంలో కొంత భాగాన్ని సామాజిక సేవలకు ఉపయోగిస్తున్నారు. అనాథలు, అభాగ్యులు, చిన్నారులు, దివ్యాంగులను ఆదుకుంటున్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా జర్చర్లకు చెందిన వై.సంజీవ కుమార్ ఒక రోజు సికిందరాబాద్ స్టేషన్ సమీపంలో ఆకలికి అలమటిస్తున్న ఓ వృద్ధురాలిని కళ్లారా చూసి మనసు చలించి, ఆలోచనకు ప్రతి రూపమే ఈ స్వచ్ఛంద సంస్థ. హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పావనితో కలసి 2012వ సంవత్సరంలో స్కై ఫౌండేషన్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ సంస్థ తమ సేవలను యాదాద్రి, జనగాం జిల్లాల్లో విస్తరించింది. అన్నదానం, వస్త్రదానం, అనాథ చిన్నారుల జన్మదిన వేడుకలు, మత ప్రమేయం లేకుండా అన్ని పండగకు అనాథలకు అన్నదానం. వేసవిలో ఎండలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు, సామాన్య ప్రజలకు, అనాథలకు మజ్జిగ, అంబలి పంపిణీ, అనాథలకు వైద్య సేవలు, మందుల పంపిణీ, నగరంలోని అనేక పోలీస్‌స్టేషన్లకు, పాఠశాలలకు మెడికల్ కిట్ల అందజేత ఇలా అనేక సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తోంది. కరోనా కారణంగా ఆకలికి అలమటిస్తున్న శునకాలకు సైతం ఆహారాన్ని అందించిన ఘనత కేవలం స్కై ఫౌండేషనకే దక్కుతుంది. చలికాలంలో రోడ్లపై వణుకుతూ నిద్రిస్తున్న అనాథలకు దుప్పట్ల పంపిణీ.

శని, ఆదివారాలు పేదల ఆకలి తీర్చటం, దుస్తుల పంపిణీ, మొక్కలు నాటడం, వేసవి కాలంలో మజ్జిగ, అంబలి పంపిణీ వంటి అనేక సామాజిక సేవలను కొనసాగిస్తోంది.

సంజీవ కుమార్ పద్మారావునగర్‌లో సొంతంగా ఒక కన్సల్టెన్సీ నడుపుతున్న ఆయన తన ఆదాయం నుంచి కొంత సొమ్మును సంస్థ కార్యకలాపాలకు కేటాయించారు. ఆకలితో అలమటించేవారికి కడుపునిండా అన్నం పెడితే కలిగే తృప్తి ఎందులోను లేదని భావిస్తారు. సికింద్రాబాద్, అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన ఐటీ ఉద్యోగి పావని తన వంతు సహకారాన్ని సంజీవకుమార్‌కు అందించి, సేవలకు ప్రోత్సహించింది. భవిష్యత్‌లో సంస్థ నిరాటంకంగా సేవలను కొనసాగించటానికి దాతలు సంప్రదించవచ్చు.




చలికాలంలో దుప్పట్లను అందిస్తున్న పావని, సభ్యులు, సంజీవకుమార్‌ను దీవిస్తున్న వృద్ధుడు

నా జీవితం సమాజ సేవకే అంకితం



కన్సల్టెన్సీ ద్వారా వచ్చే ఆదాయాన్ని సామాజిక సేవలకు వినియోగిస్తున్నాను. రోడ్ల పక్కన ఉండే అనాథలు, దివ్యాంగులకు ఆశ్రయం కల్పించి, ఆహారం, వైద్యం అందించి, కొత్త జీవితాన్నిఅందించాలన్నదే మా సంస్థ లక్ష్యం. భవిష్యతోలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా సేవలను కొనసాగిస్తా. నిధులు సరిపోవడంలేదు.

-వై. సంజీవకుమార్, స్కై ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు

పేదలకు సేవచేసే అదృష్టం లభించింది



ఆకలితో ఉన్నవారికి ఆహారాన్ని అందిస్తే వారి కళ్లలో కనిపించే ఆనందం వర్ణించలేము. అనాథలకు, అభాగ్యులకు, దివ్యాంగులకు నా వంతు సేవలను అందిచాలన్నదే నా లక్ష్యం. అలాంటి సేవలు చేసే అదృష్టం నాకు ఈ సంస్థ ద్వారా లభించింది. నా వేతనంలో నుంచి కొంత మొత్తాన్ని నెలనెలా అందిస్తున్నాను.

-ఓ.పావని, స్కై ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు



జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటాచారికి వినతిపత్రం సమర్పిస్తున్న రజక వృత్తిదారుల సంఘం ప్రతినిధులు

ప్రభుత్వ పథకాల్లో రజకులకు ప్రాధాన్యం ఇవ్వాలి

● చారకొండ వెంకటస్వామి

అడ్డగుట్ట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీల పథకాల్లో రజకులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ రజక వృతిదారుల సంఘం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు చారకొండ వెంకటస్వామి జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటాచారికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రజకులు వృత్తి మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రజకుల వలసలు పెరగడంతో వేలాది మంది హైదరాబాద్ నగరంలో ఉపాధి కోసం అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారని అన్నారు. వృత్తిదారుడికి వ్యక్తిగత రుణాలు రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లకు మించిన రజకులకు వృద్ధాప్య పింఛన్, నియోజకవర్గంలో ధోబీఘాట్ కమ్యూనిటీ హాలు నిర్మించాలి, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రజకులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, అనేక డిమాండ్లపై వినతిపత్రంలో పెర్కొన్నామన్నారు. మీడియా సమావేశంలో ఆ సంఘం గ్రేటర్ కార్యదర్శి గోపాల్, జిల్లా సహాయ కార్యదర్శి కేశవరాజు యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు రాజు, కేశవులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్ కుమార్

అర్హులైన వారికి రేషన్ కార్డులు

● ఆదం సంతోష్ కుమార్

అడ్డగుట్ట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేరుస్తుండడంతో ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆదం సంతోష్ కుమార్ విమర్శించారు. సోమవారం తుకారాంగేట్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలో అర్హులకు రేషన్ కార్డులు అందే వరకు పక్రియ కొనసాగుతుందని, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక చేస్తామన్నారు. ఈ నెల 26 నుంచి నాలుగు సంక్షేమ పథకాలు ప్రారంభం అవుతతాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల ఇళ్ల స్థలాలకు ప్రాధాన్యతిస్తుందన్నారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకానికి సంబంధించి దరకాస్తులు స్వీకరిస్తామన్నారు. ఏడాది లోపే రెండు లక్షల రుణమాఫీ చేసిందన్నారు. కార్యక్రమంలో ఆదం భరత్ కుమార్, గంట రాజుసాగర్, జాఫర్, కొమురమ్మ, నాగభుషణం, సుదర్శన్, షకీల్ ఖాన్, యూసుఫ్, అనంత కృష్ణ, భూపతి, హరిభూషణం, మంద ప్రభాకర్, శివకుమార్, నాజర్, హమీర్, వరలక్ష్మిలు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న మహిళలు

గొల్లపుల్లయ్యబావిలో ఉచిత వైద్యశిబిరం

బౌద్ధనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వారాసిగూడ గొల్లపుల్లయ్యబావిలో గృహ కార్మికుల యూనియన్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో ముత్తూట్ ఫైనాన్స్ సహకారంతో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గృహ కార్మికుల యూనియన్ హైదరాబాద్ జిల్లా కో-ఆర్డినేటర్ వల్లాల మంజుల, యూనియన్ నాయకురాళ్లు ఎం.మాధవి, స్వాతి, రజిత, బస్తీ నాయకులు గట్టయ్య, నాగరాజు, పాల్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

బౌద్ధనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్‌నగర్ సవరాలబస్తీకి చెందిన కార్తీక్(17) కీసరలోని గురుకుల రెసిడెన్సీయల్ కాలేజీలో బైపీసీ ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. కార్తీక్ సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం తల్లితండ్రులు కూలీ పనులకు బయటకు వెళ్లి తిరిగి పన్నెండు గంటలకు ఇంటికి వచ్చారు. ఇంటి తలుపులు ఎంతకొట్టిన తీయకపోవటంతో కిటికిలో నుంచి చూడగా కార్తీక్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఇరుగుపొరుగు వారి సహాయంతో తలుపులు బద్దలు కొట్టి కార్తీక్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కార్తీక్‌కు ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. తండ్రి సిద్ధులు పిర్యాదు మేరకు పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.




తుకారాంగేట్ పహాడి ఆలయంలో హుండీ పగులగొట్టిన దుండగులు
జై భవాని గుడిలో సీసీ ఫుటేజీ బాక్సును ఎత్తుకెళ్లిన దృశ్యం

రెండు ఆలయాల్లో చోరీ

● సీసీ ఫుటేజీ బాక్సు ఎత్తుకెళ్లిన దుండగుడు

అడ్డగుట్ట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గంటల వ్యవధిలో రెండు ఆలయాల్లో హుండీ పగులగొట్టి గుర్తుతెలియని దుండగులు చోరీ చేసిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. తుకారాంగేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... తుకారాంగేట్‌లోని 150 ఏళ్ల చరిత్ర కలిగిన పహాడి హనుమాన్ ఆలయంతో పాటు పక్కనే ఉన్న జై భవాని ఆలయంలో సోమవారం ఉదయం మూడు గంటల సమయంలో గుర్తుతెలియని దుండగులు ఆలయంలో చోరబడి హుండీని పడులగొట్టి డబ్బును ఎత్తుకెళ్లారు. పహాడి హనుమాన్ ఆలయం వెనుక వైపు నుంచి వచ్చిన దుండగుడు ఆలయ తలుపు గొళ్లెం తొలగించి నేరుగా ఆలయం లోపలికి ప్రవేశించి ఆలయంలో ఉన్న హుండీ పగలగొట్టి చిల్లర డబ్బులు అక్కడే ఉంచి దాదాపు రెండు వేల వరకు ఉన్న నగదును ఎతుకెళ్లాడు. ఇదే ఆలయంలో నెల రోజుల క్రితమే హుండీ లెక్కింపు జరిగింది. ఈ ఆలయం పక్కనే ఉన్న జై భవాని గుడిలో తలుపునకు గొళ్లెం ఆలయంలో ఉన్న సీసీ ఫుటేజీ బాక్సుతో పాటు దాదాపు రూ. 5 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు ఆలయ పూజారులు ఫిర్యాదులో తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం మారేడుపల్లిలోని తన కార్యాలయంలో అమీర్‌పేట్ మండల పరిధిలోని అమీర్‌పేట్, సనత్‌నగర్ డివిజన్‌లకు చెందిన 6 గురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌ల చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ లక్ష్మి, నాయకులు బాల్‌రెడ్డి, సంతోష్, మణి కుమార్, కూతరు నర్సింహ, బలరాం, జమీర్, మోహన్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

కార్పొరేటర్ హేమలతకు తలసాని పరామర్శ

పద్మారావునగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ హేమలతను ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. హేమలత సోదరుడు సత్యనారాయణ సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలిసిన తలసాని బండమైసమ్మనగర్‌లోని నివాసానికి వెళ్లి సత్యనారాయణ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం హేమలత, మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాడ సంతాపాన్ని తెలిపారు.ఆయన వెంట ప్రేమ్‌కుమార్, లక్ష్మిపతి, లంకరాజు, విజయశంకర్ అబ్బాస్ తదితరులు ఉన్నారు.



బస్తీ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

మోండా డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు

● కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

రెజిమెంటల్‌బజార్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు రూ.3 కోట్లు మంజూరు అయ్యాయని త్వరలో పనులు ప్రారంభం అవుతాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. సోమవారం డివిజన్‌లోని శివాజీనగర్, డొక్కాలమ్మ ఆలయం, మహాత్మా గాంధీ హరిజన, గిరిజన హౌసింగ్ సొసైటీ ప్రాంతాలలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అంగన్‌వాడీ భవనం, కమ్యూటీ హాల్‌పై మరో అంతస్తు నిర్మిస్తే బస్తీవాసులకు ఉపయోగంగా ఉంటుందని బస్తీవాసులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, బీజేపీ కార్పొరేటర్ ఉండటంతో సమన్వయం లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. పాత డ్రైనేజీ వ్యవస్థ ప్రస్తుతం పెరిగిన జనాభా అవసరాలకు సరిపోవడం లేదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం మంజూరు అయిన నిధులతో పాటు అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేయించి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ చంద్రశేఖర్, వాటర్ వర్క్స్ ఏఈ మనోహర్, ఎలక్ట్రిక్ సబ్ ఇంజనీర్ కార్తీక్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన

తిరుమలగిరి జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి ఆర్మీ పబ్లిక్ పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల అంశంపై తెలంగాణ మాదకద్రవ్యాల నిరోధక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమానికి తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ శివ నాయుడు, శంకర్ యాదవ్ హాజరై విద్యార్థులకు మాదక ద్రవ్యాలు తీసుకోవడం మూలంగా జరిగే దుష్పరిణామాలను వివరించారు. ఇటీవల కాలంలో పాఠశాల కళాశాల విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతున్న నేపథ్యంలో వారిలో అవగాహన కల్పించాలన్న సంకల్పంతోనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మాదకద్రవ్యాలు మనిషిలోని పరివర్తనను పూర్తిగా నశింపజేసి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు అందులో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాలు వాడొద్దని పోస్టర్లను పాఠశాలల్లో అంటించారు. ఆర్మీ పబ్లిక్ స్కూల్ కౌన్సిలర్ డాక్టర్ సుధా మేనన్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.



విద్యార్థులతో డీఎస్పీ శివ నాయుడు, శంకర్ యాదవ్



విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న మార్వాడి యువమంచ్ ప్రతినిధులు

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

పద్మారావునగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అఖిల భారత మార్వాడి యువ మంచ్ సికిందరాబాద్ అధ్యక్షుడు సురేశ్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి బోలక్‌పూర్ కృష్ణానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు విద్యను అభ్యసించే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతీఏటా నోట్ పుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూప మాట్లాడుతూ 8 సంవత్సరాలుగా విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న మార్వాడీ యువ మంచ్ సంస్థ ప్రతినిధులకు విద్యార్థులు, తల్లిదండ్రుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ కార్యదర్శి పంకజ్ రాతోడ్, కోశాధికారి ప్రదీప్ తివారీ, పాఠశాల డోనర్, సభ్యులు నారాయణ్‌జీ చౌడ, అశోక్‌జీ చౌడ, రామ్‌రాజ్ తివారీ, దినేశ్‌జీ పూరి, రమేశ్ ప్రజాపతి, మంగళమ్ చౌదరి, హరీశ్‌జీ మాలి పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి: రామకృష్ణ

తిరుమలగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని కంటోన్మెంటు బోర్డు మెంబర్ జన్యవుల రామకృష్ణ అన్నారు. బస్తీబాటలో భాగంగా సోమవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని వార్డ్-7 ఎస్‌బీహెచ్ కాలనీ, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో పర్యటించిన రామకృష్ణ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌బీహెచ్ కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఎన్నికలు ఉన్నా లేకపోయిన బీజేపి నాయకులు నిరంతరం ప్రజల మధ్యలో అంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. కంటోన్మెంట్‌లో జరుగుతున్న అభివృద్ధి అంతా కూడా కంటోన్మెంట్ బోర్డు నిధులు, కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించడం లేదని అన్నారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు నిరంతరం ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వార్డ్-7 బీజేపీ అధ్యక్షుడు పవన్ కుమార్, పూర్వ అధ్యక్షుడు ప్రశాంత్ ప్రభు, నాయకులు శ్రీధర్ రెడ్డి, మంజుల, విశ్వనాద్, నాగేందర్, నరసింహ, స్థానికులు అరవింద్, జీఎస్ బోస్, పెద్ద రాజు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న బోర్డు మెంబర్ రామకృష్ణ



ట్రోఫీలతో క్రీడాకారుల

హెచ్‌ఓటీఏ టెన్నిస్ విజేతలు రామ్‌రెడ్డి, ఈశ్వర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ (హెచ్‌ఓటీఏ) నిర్వహించిన జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నమెంట్‌లో రామ్‌రెడ్డి, ఈశ్వర్ సాయి విజేతలుగా నిలిచారు. మూడ్రోజులుగా సికింద్రాబాద్ క్లబ్‌లో జరుగుతున్న ఈ పోటీలు సోమవారం ముగిశాయి. దేశ వ్యాప్తంగా సుమారు 220 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పురుషుల 60 ప్లస్ సింగిల్స్‌లో రామ్‌రెడ్డి, 30 ప్లస్ సింగిల్స్‌లో ఈశ్వర్ సాయి విజేతలుగా నిలిచారు. 50 ప్లస్ డబుల్స్‌లో కుమారస్వామి-వెంకటేశ్వర్లు జోడీ టైటిల్ సాధించగా, నంద్యాల నరసింహారెడ్డి-రమేష్ ద్వయం రన్నరప్‌తో సరిపెట్టుకుంది. హెచ్‌ఓటీఏ అధ్యక్షుడు నరసింహారెడ్డి విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు.

రైల్వే టికెట్ల జారీలో అక్రమాలకు చెక్

● అధునాతన టెక్నాలజీతో ఆర్పీఎఫ్ వ్యూహాలు

హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రైల్వే టిక్కెట్ల జారీలో అక్రమాలను అరికట్టడానికి రైల్వే రక్షణ దళం వ్యూహాత్మకంగా సన్నద్ధమైందని, అధునాతన సాంకేతికతలను ఉపయోగించుకోవడం ద్వారా, సంబంధిత ఏజెన్సీలతో సహకారాన్ని పెంపొందించడం, ప్రయాణికులను అప్రమత్తం చేయడం ద్వారా బ్లాక్ మార్కెటింగ్‌ను తగ్గించడంలో ఆర్పీఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందని సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు. పలు వ్యూహాలతో ప్రయాణీకులకు సురక్షితమైన, న్యాయమైన ప్రయాణ అనుభవం లభిస్తుందని వెల్లడించారు. భారతీయ రైల్వే టిక్కెట్ల వ్యవస్థలో టిక్కెట్ల అమ్మకం, బ్లాక్ మార్కెటింగ్ నిరంతర సమస్యగా మారిందని, మరీ ముఖ్యంగా రద్దీగా ఉండే ప్రయాణ సమయాల్లో ఈ చట్టవిరుద్ధ కార్యకలాపాలు ప్రయాణికులకు రైల్వే వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీసేలా మారాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) బహుముఖ వ్యూహాన్ని అమలు చేసిందన్నారు. అధునాతన కృత్రిమ మేధస్సు ద్వారా టికెటింగ్ కార్యకలాపాల్లో క్రమరాహిత్యాలను గుర్తించేందుకు వీలవుతుందన్నారు. మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్‌లతో అనుమానాస్పద లావాదేవీలను సరైన సమయంలో గుర్తించి నిలిపివేయడం జరుగుతుందన్నారు. సమర్థవంతమైన పర్యవేక్షణ వ్యవస్థలు ఒకే ఐపీ చిరునామా నుంచి ఎక్కువ బుకింగ్‌లను గుర్తించి బ్లాక్ చేస్తాయన్నారు.

టికెట్ బుకింగ్‌లను బయోమెట్రిక్ డేటాకు లింక్ చేయడం వల్ల తనిఖీల సమయంలో ప్రయాణీకుల ధ్రువీకరణను నిర్ధారించేందుకు వీలవుతుందన్నారు. అనుమానాస్పద ధోరణులను గుర్తించడానికి క్లౌడ్ ఆధారిత వ్యవస్థలు టికెటింగ్ డేటా యొక్క తక్షణ విశ్లేషణను సులభతరం చేస్తాయన్నారు. ప్రయాణ సీజన్లలో అక్రమ టికెటింగ్ నివారణకు చారిత్రక డేటా ఉపకరిస్తుందని పేర్కొన్నారు.



కుటియా దేవాలయంలో సోమవారం భారతదేశం అత్యున్నత న్యాయస్థానం మాజీ జస్టిస్ పినాకి చంద్రఘోష్ కుటుంబంతో సహా స్వామి వారిని సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కేజీ రాజు, హరిబాబు, ఉదయ్ కుమార్, కేజి రవి, కిరణ్ కుమార్, మోహన్‌రావు, భీమ్ రావులు పాల్గొన్నారు. -తిరుమలగిరి, ఆంధ్రజ్యోతి



మోండా డివిజన్ ఆదయ్యనగర్ గాస్మండిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను కార్పొరేటర్ కొంతం దీపిక సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. -రెజిమెంటల్‌బజార్, ఆంధ్రజ్యోతి



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మొదటి రోజు రైల్వే పోలీసులు రిహార్సల్స్ చేస్తున్న దృశ్యం